జీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నారాయణ పురం గ్రామస్తులు

ఈ సెక్రటరీ మాకొద్దు

జీపీ కార్యాలయం ఎదుట నారాయణ గ్రామస్తుల ఆందోళన

బయ్యారం, డిసెంబర్ 3 : గ్రామ పంచాయతీకి రాడు.. పని చేయాలంటే పైసలు ఇవ్వాలి.. దురుసు ప్రవర్తనతో ఇబ్బందిపడుతున్నామని, ఈ సెక్రటరీ మాకొద్దని నారాయణపురం గ్రామస్తులు మంగళవారం జీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇక్కడ సెక్రటరీగా పనిచేస్తున్న రమేశ్ అవినీతికి పాల్పడుతున్నాడని, ఇంటి నంబర్ ఇవ్వాలన్నా, కరెంట్ మీటర్ పర్మిషన్ కావాలన్నా, గిరివికాస్ బోర్ల విషయంలో వేలల్లో డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీకి సరిగ్గా రాడని, ఏదైనా పని కావాలంటే అందుబాటులో ఉండకపోవడంతో తాము ఇబ్బందిపడుతున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు కోసం పలువురు గ్రామస్తుల వద్ద డబ్బులు వసూలు చేశాడని, తీసుకున్న డబ్బులు ఇవ్వమని అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని అన్నారు. దశాబ్దాలుగా ఇక్కడ ఉంటున్న బీసీలను 'మీకు ఇక్కడ ఉండే హక్కు లేదు' అంటూ అన్నదమ్ములా కలిసి ఉంటున్న గిరిజన, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెడుతున్నారని అన్నారు. సెక్రటరీ అవినీతిపై గతంలో పలుమార్లు ఎంపీవో, ఎంపీడీవో, డీపీవోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్రటరీపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా, విషయం తమ దృష్టికి రాలేదని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నెల్లికుదురు, డిసెంబర్ 3 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నిర్వాహకులను ఆదేశించారు. మండంలోని ఎర్రబెల్లిగూడెంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యానికి కాంటాలు నిర్వహించారు..? ఎన్ని బస్తాలు మిల్లర్లకు తరలించారు...? ఇంకా ఎన్ని క్వింటాళ్లు కాంటా వేయాల్సి ఉన్నదని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం, రైతుల వివరాలను ఓపీఎంఎస్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీవో పద్మ, మండల వ్యవసాయ అధికారి ఎస్‌కే యాస్మిన్ బేగం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలను పరిష్కరించాలి

కొత్తగూడ, డిసెంబర్ 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) కొత్తగూడ, గంగారం సంయుక్త మండలాల కమిటీ సహాయ కార్యదర్శి ల్యాదళ్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానలో ఆరుగురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా, ఇద్దరు మాత్రమే ఉన్నారని అన్నారు. వెంటనే డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులను భర్తీచేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు రాజబోయిన రాజు, డాక్టర్ సంపత్, ఏఎన్ఎంలు శ్రీకల, విజయ, రాజేశ్వరి, పూల, సుజాత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MOHAMMED HANEEFUDDIN S/o MOHAMMED MUNEERUDDIN (New Name) H.No: 16-11-451/44, Chinthal, Warangal, Warangal Dist. TG, Changed my name from MOHAMMAD HANEEFUDDIN S/o MUNEERUDDIN to MOHAMMED HANEEFUDDIN S/o MOHAMMED MUNEERUDDIN for all purpose.
NTW-000

CHANGE OF NAME

I, BOKKA LAXMI W/o BOKKA KRISHNA @ CHILUMULA RAJESWARI D/o CHILUMULA NARSAIAH R/o H.No. 10-113/8, Vill: Palakurthy, Mdl: Palakurthy, Jangaon Dist TG, There fore above said both names BOKKA LAXMI and CHILUMULA RAJESWARI bearing to me only and I am One and same person.

CHANGE OF NAME

★I, NALLATHEEGALA MANASWINI W/o NALLATHEEGALA RAGHUNATH H.No: 7-1-364/15, Padmakshi Colony, Hanamkonda, Hanumakonda Dist. Pin-506001. TG, Here by declare that. Changed my name from CHAPARTHY KAVITHA D/o CHAPARTHY KANKAIAH to NALLATHEEGALA MANASWINI W/o NALLATHEEGALA RAGHUNATH for all purpose.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

వంట గదులను శుభ్రంగా ఉంచాలి

రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్ : సంక్షేమ హాస్టళ్ల వంట గదులను శుభ్రంగా ఉంచాలని రాష్ట్రవిద్యా కమిషన్ మెంబర్ ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన జిల్లా పర్యటనలో భాగంగా పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌తో కలిసి సందర్శించారు. హాస్టల్ పరిసరాలు, స్టోర్‌రూమ్, తరగతి గదులు, డైనింగ్ హాల్, మధ్యాహ్నం భోజన వసతులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సైదానాయక్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో..

గూడూరు : వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు సూచించారు. మంగళవారం ఆయన గూడూరు మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే పాఠశాల, కస్తూర్బా పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థుల హాజరు, పరిసరాలు, వంటగదిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సైదానాయక్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ అజాద్, జీసీడీవో విజయకుమారి, వార్డెన్స్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విద్యా కమిషన్ మెంబర్, కలెక్టర్

గూడూరు: హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పౌష్టికాహారం అందించాలి..

తొర్రూరు/పెద్దవంగర : విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరావు సూచించారు. మంగళవారం తొర్రూరు ఉన్నత పాఠశాల, పెద్దవంగర కేజీబీవీని సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కాల పరిమితి ముగిసిన వాటిని వినియోగించొద్దన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి కేజీబీవీ సెక్టోరిల్ ఆఫీసర్ విజయకుమారి, ఎంఈవోలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర

విప్, ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

డోర్నకల్, డిసెంబర్ 3: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ అన్నారు. మంగళవారం ఆయన చిల్కోడు, గొల్లచర్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కాంటాలు నిర్వహించిన 48గంటల్లోనే డబ్బులు రైతులు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు.రూ.200కోట్లతో డోర్నకల్ నియోజకవర్గ కేంద్రానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, వైస్ చైర్మన్ శెట్టి వెంకన్న, తహసీల్దార్ కృష్ణవేణి, సీఈవో సత్తార్, నాయకులు గొర్ల సత్తిరెడ్డి, శ్రీనివాస్, మేకపోతుల శ్రీనివాస్, లెనిన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన డోర్నకల్ రైల్వేస్టేషన్ నుంచి గాంధీసెంటర్ వరకు నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొల్లచర్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

పారిశుధ్య కార్మికులకు సన్మానం

మరిపెడ, డిసెంబర్ 3 : పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులను సన్మానించి, వారికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ నిత్యావసర సరుకులను అందజేశారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ నరేశ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి పండుగలోపే రైతుభరోసా కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ ప్రగతిశ్రీపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యగారిపల్లిలో సమీకృత గురుకుల పాఠశాల

కురవి, డిసెంబర్ 3 : కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్ స్థలాన్ని పరిశీలించారు. ఈనెల 8న శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం తదితర నాయకులు పాల్గొన్నారు.

బయ్యారం ఏజెన్సీలో షూటింగ్ సందడి

బయ్యారం, డిసెంబర్ 1: బయ్యారం ఏజెన్సీలో సినిమా షూటింగ్ సందడి నెలకొన్నది. ఎస్‌వీఎస్ ప్రొడక్షన్ నిర్మిస్తున్న'ప్రభుత్వ సారాయి దుకాణం' చిత్ర సన్నివేశాలను కొత్తగూడెం, లింగగిరి, కోటగడ్డ, బయ్యారం పెద్దచెరువు పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి డైరెక్టర్‌గా నర్సింహానంది , ప్రొడ్యూసర్‌గా పడిగి శ్రవంతీమల్లిక్, దైవా నరేశ్‌గౌడ్ , మేనేజర్‌గా భూక్యా బాలూనాయక్ వ్యవహరిస్తుండగా విక్రమ్, వినయ్, సదన్, దేవర నరేశ్,విజయ రంగరాజు, సీహెచ్ ప్రేమ్, రాజా, గురువారెడ్డి, అతిథి,మోహన్, శ్రీలు,జ్యోతి , స్వప్న నటిస్తున్నారు. అంతేకాకుండా వెయ్యికి పైగా చిత్రాల్లో నటించిన సీనియర్ నటుడు బాలగంగాదర్‌తిలక్ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో షూటింగ్ జరుగుతుండడంతో జనం చూసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ నెలాఖరు వరకు షూటింగ్ జరగనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

చిత్రంలోని ఓ సన్నివేశం

బాధిత కుటుంబానికి పరామర్శ

దంతాలపల్లి : దోనకొండ గ్రామంలో బాధిత కుటుంబాన్ని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు. గ్రామానికి చెందిన చొప్పరి సోమయ్య ఇటీవల మృతిచెందగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, నాయకులు వొలాద్రి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ చొప్పరి ఉప్పలయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, లింగన్న, మల్లయ్య ఉన్నారు.

కొరిపల్లిల్లో గంజాయి కలకలం..

పెద్దవంగర, డిసెంబర్ 3 : మండలంలోని కొరిపల్లి గ్రామంలో పోలీసులు గంజాయిని పట్టుకున్నట్లు, పట్టుబడిన వారిలో అధికార పార్టీ యూత్ లీడర్ ఉన్నట్లు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మంగళవారం తెల్లవారుజామున కొరిపల్లి గ్రామంలో గంజాయితో పట్టుబడిన వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఎస్సై క్రాంతికిరణ్ వివరణ కోరగా.. గంజాయి తాగినట్లు అనుమానం రావడంతో ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎస్సై తెలిపారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాల ఎంపిక అనేది పంటదిగుబడికి కీలకమని, విత్తనాలు కొనే సమయంలో సైతం జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లోకి రాత్రికి రాత్రే వచ్చి విక్రయం చేసే నకిలీ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనొద్దని సూచించారు.

లంబాడా భాషకు లిపిని కనుగొనాలి

కురవి: లంబాడా భాషకు లిపిని కనుగొని ప్రాచుర్యం కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం న్యూఢిల్లీలోని నేషనల్ కమిషన్ షెడ్యూల్డ్ ట్రైబ్ సభ్యులు నిరూపం చక్కకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ మాట్లాడుతూ.. దేశంలో లంబాడా భాష మాట్లాడేవారు 10కోట్ల మంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మాలోత్ కిషన్, వెంకన్న, శోభన్, వైష్ణవి, వినోద్, శోభన్ పాల్గొన్నారు.

8న సుధాకర్ ప్రమాణ స్వీకారం

కురవి(సీరోలు) : ఈ నెల 8వ తేదీన మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్‌గా సుధాకర్ నాయక్ ప్రమాణ స్వీకారం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ కురవి మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్ తెలిపారు. కురవి, డోర్నకల్, సీరోలు మండలాల నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా ధనమ్మ బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 3 : జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా ధనమ్మ మంగళవారం బా ధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వర్తించిన వరలక్ష్మి ఉద్యోగ విరమణ పొందగా, ఆమె స్థానంలో ఖమ్మం జిల్లా మధిర సీడీపీవోగా విధులు నిర్వర్తించిన ధనమ్మ పదోన్నతిపై జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యత లు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న సీఎం

మహబూబాబాద్ రూరల్ : సీఎం రేవంత్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నాడని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీఆర్‌ఏల నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. జీవో నంబరు 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, రాందాసు, బాలు, శ్రీను, కిరణ్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నెల్లికుదురులో మెగా వైద్య శిబిరం

నెల్లికుదురు, డిసెంబర్ 3 : ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మెగావైద్య శిబిరాన్ని నిర్వహించారు. అజరా, లక్ష్మీనర్సింహ, మేధ కంటి ఆస్పత్రి వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సమితి చైర్మన్ జాను మాట్లాడుతూ.. ముమ్ముందు మరిన్ని వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బీ సంధ్యారాణి, డాక్టర్ అంద్రు పావనీరెడ్డి, జీపీ సెక్రటరీ వేదరాజేశ్వర్, ఏఎపీం వరదయ్య, ప్రగతి సేవా సమితి మండల కో ఆర్డినేటర్ చెడుపాక వెంకన్న, మండల సమాఖ్య కార్యదర్శి తాళ్ల సునీత పాల్గొన్నారు.

నూతన పద్ధతులు పాటించాలి

మరిపెడ, డిసెంబర్ 3: రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులను పాటించేలా శిక్షణ ఇప్పించాలని, అందుకు వ్యవసాయ, ఉద్యానశాఖ సహకారం తీసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పురపాలక సంఘం పరిధిలోని ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఆకేరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ కార్యక్రమం చేపట్టినా సమష్టి నిర్ణయాలతో కంపెనీని ముందుకు నడిపించాలని, ఎక్కువ మంది రైతులను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏవిజయ్ చంద్ర, మరిపెడ వ్యవసాయ అధికారి వీరాసింగ్, ఆకేరు రైతు కంపెనీ సీఈవో పరశురాములు, కొండూరు వెంకన్న, కంపెనీ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 3 : మున్సిపల్ బిల్డింగ్‌కు కేటాయించిన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణ శివారులోని అనంతారం రోడ్‌లో ఉన్న మున్సిపల్ స్థలాన్ని చైర్మన్ రామోహ్మన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్నతో కలిసి ఆయన సందర్శించారు. మున్సిపల్ భవనానికి కేటాయించిన స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు ప్రహరీ నిర్మిస్తే కూల్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు జనార్దన్, సోమయ్య, అజయ్ సారథి, డీఈ ఉపేందర్, పాల్గొన్నారు.

అవినీతి రహిత జిల్లాగా మార్చుదాం

మహబూబాబాద్ రూరల్ : అవినీతి రహిత జిల్లా మార్చుదామని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అవినీతి రహిత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అవినీతిని తరిమేసి దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దామన్నారు. జిల్లాలో నేటి నుంచి 9వరకు అవినీతి రహిత వారోత్సవాలను నిర్వహించాలన్నారు. ఎవరైనా లంచమడిగితే 1064కు కాల్ చేసి తెలియ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరబ్రహ్మం, ఏసీబీ సీఐ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పరిశీలన

నర్సింహులపేట :మండలకేంద్రంలోని మోడల్ స్కూల్, బాలికల బీసీ హాస్టల్, కేజీబీవీని మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ పరిశీలించారు. మోడల్ స్కూల్‌లో వంటగది లేకపోవడం, మధ్యాహ్న భోజన బిల్లులు రాక ఇబ్బందిపడుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారు. బాలిక హాస్టల్‌కు డోర్లు సరిగ్గా లేక కోతులు వస్తున్నాయని, కిటికీలకు మెస్‌డోర్లు లేవని, మరుగుదొడ్లు , స్నానాల గదుల్లో నుంచి నీరు బయటికి వెళ్లడం లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కేజీబీవీలో మరుగుదొడ్లు, మూత్రశాలల్లో లైట్లు ఏర్పాటు చేయాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో మాధవి, ఎంఈవో రామ్మోహన్‌రావు, ఎంపీవో యాకయ్య పాల్గొన్నారు.

ఒక ఊరు.. కమిటీలు రెండు

నిన్న ఒక కమిటీ.. నేడు మరొకటి.. , కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు?

నర్సింహులపేట, డిసెంబర్ 3 : కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు సర్వసాధారణమైపోయాయి. ఒకే గ్రామంలో రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా ఎవరికి వారే కమిటీలు వేసుకొని ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడిని వారిని పక్కన పెట్టి, తమకు నచ్చిన వారిని నియమించడంతో కార్యకర్తలు అయోమయానికి గురువుతున్నారు. పార్టీని అడ్డం పెట్టుకొని కాంట్రాక్టర్లను బెదిరించడంతోపాటు ఇసుక, బెల్లం దందా చేస్తున్న వారికి పార్టీలో పెద్దపీట వేస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని జైలుపాలైన వారినే పక్కన పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం గ్రామంలో సోమవారం కాంగ్రెస్‌లోని ఒకవర్గం కలిసి ఒక వ్యక్తిని గ్రామ అధ్యక్షుడిగా నియమిస్తే.., మంగళవారం మరో కొంతమంది నాయకులు మరో గ్రామ కమిటీని మంగళవారం ప్రకటించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కమిటీ వేశామని ఒకవర్గం చెబుతుండగా, మండల కమిటీ ఆదేశాల మేరకు తాము కమిటీ వేశామని మరో వర్గం వారు చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు రెండు వర్గాలు కమిటీలు వేసుకోవడం మండల వ్యాప్తంగా చర్చనీయంగా మారింది. ఇప్పటికే నూతన గ్రామ పంచాయతీలో సైతం కష్టపడిన కార్యకర్తకు బదులు నాయకుల సొంతపని చేసేవారిని గ్రామ పార్టీ అధ్యక్షుడిగా నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. అసలు కాంగ్రెస్ నాయకులం మేమంటే మేము అని చెప్పుకోవడంతో ఇదేంటని మండల ప్రజలు ముక్కువేలేసుకుంటున్నారు.

సోమవారం ప్రకటించిన పెద్దనాగారం గ్రామ కమిటీ

మంగళవారం ప్రకటించిన కాంగ్రెస్ గ్రామ కమిటీ

మహిళల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

మహబూబాబాద్ రూరల్,డిసెంబర్3 : మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎమ్మెర్వో సెంటర్ నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వీరబ్రహ్మం ఆలయంలో మున్సిపల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

సేవాభావాన్ని కలిగి ఉండాలి

మహబూబాబాద్ రూరల్: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోప్ స్టెప్స్ ఫౌండేషన్